## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



దీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న మాధవరెడ్డి

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ బలోపేతమే ధ్యేయంగా అంకిత భావంతో పని చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇటీవల మండల సచివాలయాల కన్వీనర్–2గా ఎంపికైన మల్లప్పగారి మాధవరెడ్డి ఆదివారం చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డికి శాలువా కప్పి, పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. పార్టీ మండల కన్వీనర్, మండల సచివాలయ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలతో కలుపుకుని సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

### 5న రాష్ట్ర ప్రథమ మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: విజయవాడలో డిసెంబర్ 5న ఏపీపీటీడీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్ర ప్రథమ మహాసభలు విజయవంతం చేయాలని అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తి ఆర్టీసీ డిపో ఆవరణలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీపీటీడీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడలో మొదటి సారిగా రాష్ట్ర ప్రథమ మహాసభలు జరుగుతాయన్నారు. రాష్ట్ర నాయకురాలు సీహెచ్ భావన, జిల్లా నాయకులు మురళీ నాయక్, నరసింహులు, రమణప్ప, మోహన్ నాయక్, ఆదెన్న, గోవిందు, మల్లికార్జున, ఓబుళపతి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీల్లో సత్తా



గేయశ్రీకి షీల్డ్, సర్టిఫికెట్ అందజేస్తున్న సాయిబాబా సేవా సమితి సభ్యులు

బత్తలపల్లి: స్థానిక శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థిని కె.గేయశ్రీ వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్ఎం మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల శ్రీసత్య సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని కె.గేయశ్రీకి ఆదివారం ధర్మవరంలో షీల్డ్‌తో పాటు సర్టిఫికెట్ అందజేశారన్నారు. అలాగే స్కూల్ స్థాయిలో విన్నర్స్‌గా నిలిచిన హర్షవర్ధన్ సాయి, తీర్థి, హర్షవర్ధన్, కీర్తన బహుమతులు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు ధర్మతేజ, నాగపెద్దిరాజు, కాటమయ్య, వెంకటపతి, శంకరయ్య, రమేష్, రాజశేఖర్, ధనలక్ష్మీ, షబానా, షమీల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### నృత్య కళాకారులకు నంది అవార్డులు



నంది అవార్డులు అందుకుంటున్న ధర్మవరం నాట్యాచార్యులు, కళాకారులు

ధర్మవరం అర్బన్: కాణిపాకంలో శనివారం రాత్రి శ్రీసాయి నృత్యాంజలి ఫైన్ ఆర్ట్స్ వారు 8వ జాతీయస్థాయి నంది నృత్యోత్సవాలు నిర్వహించారు. ధర్మవరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ నృత్య కళాకారులకు నంది అవార్డులు వచ్చాయని నాట్యాచార్యులు బాబు బాలాజీ, కమల బాలాజీ ఆదివారం తెలిపారు. శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్యాచార్యులు బాబు బాలాజీ, కమల బాలాజీ, శిష్య బృందం రామ లాలిత్యతోపాటు 21 మంది కళాకారులకు బాల గణపతి నాట్య నంది అవార్డులను నిర్వాహకులు అందించారు. గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీని వినాయక నాట్య నందీశ్వర పురస్కారంతో కాణిపాకం ఈఓ, చైర్మన్, అధ్యక్షుడు సన్మానించారు. .

### ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షకు 200 మంది హాజరు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించారు. సత్యసాయి జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నం సుధాకర్, ఉపాధ్యక్షుడు సత్యమయ్య, జిల్లా కౌన్సిలర్లు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఉమామహేశ్వర ప్రసాద్, మురళి, సేతుమాధవ్, నాగప్రసన్న పరీక్ష ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. దాదాపు 200 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

# కమనీయం.. 'కార్తీక' దీపోత్సవం

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజవర్గాల్లోని ఆలయాల్లో ఆదివారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం, పుట్టపర్తి, ఎన్పీకుంట మండలాల్లో తెలవారుజాము నుంచే మహిళలు ఆలయాలకు పోటెత్తారు. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోమోగాయి. దీపారాధనలతో కార్తీక శోభను సంతరించుకున్నాయి. పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్‌లోని సాయి దర్బార్ ఆలయంలో మహిళలు దీపోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ఆలయాన్ని శుద్ధి చేసి పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుడి ఆలయంలో ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్, ఆలయ శాశ్వత ధర్మకర్త దంపతులు కోటి సూర్యప్రకాష్‌బాబు, కోటి సుధ దీపాలు వెలిగించారు. తాడిమర్రి మండలంలోని భైరవేశ్వర ఆలయం, చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. సరిహద్దులోని వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లి సమీపంలోని కోనమల్లేశ్వరం క్షేత్రంలో వందలాది మంది మహిళలు కార్తీక పూజలు చేశారు. ధర్మవరం మండలం నాగలూరు వద్ద ఓ తోటలో ఆదిగురు ఉచిత యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో కార్తీకమాస వన భోజనాలు నిర్వహించారు. యోగా శిక్షణ కేంద్రం అధ్యక్షుడు గొర్ల నారాయణరెడ్డి సమక్షంలో శివుడికి పాలాభిషేకం చేసి, ఉసిరి చెట్టుకు పూజలు చేశారు.

– సాక్షినెట్‌వర్క్:



బత్తలపల్లి ఓంకారేశ్వరుడి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు





తాడిమర్రిలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు, పూజలందుకున్న శివుడు



పుట్టపర్తి టౌన్: పెదపల్లి శివాలయంలో దీపోత్సవం



ఎన్పీకుంటలో కార్తీక దీపాల శోభ



ధర్మవరం అర్బన్: కార్తీక వనభోజనాల సందర్భంగా శివలింగానికి పూజలు

# జగనన్నకు మరోసారి పట్టం కట్టండి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం. మరోసారి జగనన్నకు సీఎంగా పట్టం కట్టాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బ్రాహ్మణ వీధి, పాత తహసీల్దార్ కార్యాలయం, ఇసుకవంక, గాంధీనగర్ తదితర కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కాలనీలో ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. అర్హత ఉండి కూడా పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు లేరని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించామన్నారు. సీఎం జగన్ పాలనలో ఏపీ అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. గత ప్రభుత్వం పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. నేడు కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి ఏమిటో చేసి చూపించానన్నారు. అర్హులైన లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంటి స్థలం ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామాల్లో రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్రంలోనే పుట్టపర్తి నియోకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఫోర్‌లేన్ రోడ్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. మరింత అభివృద్ధి చెందాలంటే మరొక్కసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, నాయకులు రెడ్డప్ప రెడ్డి, నాగరాజు, దర్గా కమిటీ మేనేజర్ అతావుర్ రహిమాన్, దాల్‌మిల్ సూరి, వైస్ ఎంపీపీ వడ్డే సరళ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంగడి సోమశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, లాయర్ నాగమల్లేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వడ్డే నారాయణ, ఎంపీటీసీలు రఫీ, ఆవుల లక్ష్మీదేవి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు షాన్‌షేట్, టౌన్ కన్వీనర్ భాస్కర్, అంగడిసత్తి, ఉప సర్పంచ్ యుగంధర్, నాయకులు పెయింటర్ కేశవ, ఎల్లప్ప, వెంకటరాముడు, డీలర్ శీన, సుబ్బారావు, పెయింటర్ గిరి, మారుతి, అశోక్, సుబ్బారావు, మిక్సర్ అయ్యుబ్, గొడ్డాల్ జాకీర్, విజయ్, ఈడిగ మనోహర, క్రిష్ణమూర్తి, నాయకురాలు ప్రభావతమ్మ పాల్గొన్నారు.

# కందికుంట.. సెల్ఫీ వేషాలు మానుకో

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



కదిరి: టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ సెల్ఫీ వేషాలను చూసి జనం నవ్వుకుంటున్నారని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'పట్టణంలోని ముస్లిం మైనార్టీ షాదీమహల్ దగ్గరకెళ్లి దీన్ని నేనే కట్టించానంటూ కందికుంట వెంకట ప్రసాద్ ఒక సెల్ఫీ దిగారు. ఆయన దాని కోసం ఐదు, పది లక్షలు ఇచ్చిండచ్చు. ఆ డబ్బు కూడా నకిలీ డీడీల ద్వారా బ్యాంకులను మోసగించి తెచ్చినవే. అదే విధంగా సొంత నిధుల పేరుతో షాదీమహల్ కోసం ఖర్చు చేసిన డబ్బును తిరిగి ఎంపీ నిధుల ద్వారా రాబట్టుకున్నారు. షాదీమహల్ వాస్తవ విషయానికొస్తే దాని నిర్మాణం కోసం పట్టణంలోని లారీ అసోసియేషన్ వారు రూ.20 కోట్లకు పైగా విలువ చేసే స్థలాన్ని అప్పట్లో ఉచితంగా ఇచ్చారు. వారు ఏనాడూ ఇది మాదే అనలేదు. అలాగే దాని నిర్మాణం కోసం దివంగత నాయకుడు జొన్నా సూర్యనారాయణ రూ.2 కోట్లకు పైగా ఇచ్చారు. ఆయన కూడా ఏనాడూ దీన్ని నేనే కట్టించానని చెప్పలేదు. ఆ తర్వాత మైనార్టీ నాయకుడు ఖాసీంఖాన్ కూడా షాదీమహల్ నిర్మాణం కోసం రూ.40 లక్షలకు పైగా ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చారు. ఈయన కూడా ఇలా చెప్పలేదు.

**అప్పుడు అభివృద్ధి చేయాలనిపించలేదా?**

'2009 నుంచి 2014 వరకూ కందికుంట ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాత టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈయన ఇన్‌చార్జ్‌గా కూడా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఏనాడూ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో నేను చేసిన అభివృద్ధి ఏంటో కదిరి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు' అని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నో మారుమూల గ్రామాలకు రోడ్లు వేయించాను. ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. దీన్ని జీర్ణించుకోలేక కందికుంట రోజుకో అవతారమెత్తుతున్నాడు. ఈయన కబ్జాలు, రౌడీయిజం, దౌర్జన్యాలు కదిరి నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసు. అందుకే ఈయన్ను ప్రజలు పదే పదే ఓడిస్తున్నారు. అయినా ఈయనకు సిగ్గురాలేదు. నకిలీ డీడీల కేసులో రేపో మాపో జైలుకెళ్లడం ఖాయం.. అప్పుడు టీడీపీ టికెట్ ఎవరికిస్తారో ఆలోచించుకో' అని ధ్వజమెత్తారు.

### యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

గాండ్లపెంట: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల కమిటీని ఆ సంఘం జిల్లా కోశాధికారి శ్రీనివాసులు నాయక్, పర్యవేక్షకుడు తాహీర్‌అలీ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామసుబ్బయ్య, అధ్యక్షుడిగా రమణానాయక్, ఉపాధ్యాయులుగా ఖాదర్‌బాషా, ప్రమీలాదేవి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా ఎంవీ నారాయణరెడ్డి, జిల్లా మహాసభ ప్రతినిధిగా వైవీ సుబ్బారెడ్డి, మల్లికార్జున, కార్యదర్శులుగా మరో 5 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.

### కునుతూరులో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కునుతూరు, పోతుకుంట గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను కల్పించారు. ఇంకా లబ్ధి పొందని వారిని నమోదు చేయించారు. ఆధార్ క్యాంపు, మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చాంద్‌బాషా, ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఈఓఆర్డీ మమతాదేవి, ఏఓ మస్తాన్, డాక్టర్ పుష్ప, ఏపీఎం రఘునాథరెడ్డి, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కొండమనాయునిపాళెం, ముత్యాలచెరువు పంచాయతీ కార్యాలయాల్లో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నోడల్ ఆఫీసర్ అంజనప్ప మాట్లాడుతూ.. అర్హులై ఉండి ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందని వారికి అవగాహన కల్పించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు.

# అభివృద్ధి వైపు అడుగులు



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: టీడీపీ అరాచక పాలనకు దూరంగా రాప్తాడు నియోజక వర్గాన్ని అభివృద్ధి వైపు అడుగులు వేయిస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక మార్కెట్ సర్కిల్లో వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ప్రజా సంక్షేమ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో స్కామ్‌ల ద్వారా చంద్రబాబు ప్రజాధనాన్ని లూటీ చేస్తే... సీఎం జగన్ నవరత్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేదవాడికి న్యాయం చేస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ప్రభుత్వం రూ.245 కోట్లను ప్రజల ఖాతాల్లోకి నేరుగా జమ చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు దూరం కావాలంటే మరోసారి మంచి మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పరిటాల కుటుంబం 25 ఏళ్ల పాటు ఇక్కడ దోపిడీ పాలన సాగించిందని, తనకు ఒక్కసారి ఓటు వేసి గెలిపించినందుకు పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చి రైతన్నల చిరకాల కోరిక తీర్చామన్నారు. 25 వేల మంది పేదలకు ఇళ్లు, రైతన్నలకు ఉచితంగా 2 వేల బోర్లు, 10 వేల మంది మహిళలతో సహకార డెయిరీ ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, డైరెక్టర్ ప్రభాకర్, సర్పంచ్ అంకె పరిమళ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, నాగముని, పాపన్న, నల్లప్ప, నాగేష్‌గౌడ్, రమేష్, శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**నివాళి**

రామగిరి: మండలంలోని పెనుబోలు గ్రామంలో కురుబ నారాయణమ్మ అలియాస్ దేవరమ్మ (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసే నాగార్జున, సర్పంచ్‌లు నరేంద్ర, చెన్నకేశవరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నరసింహగౌడ్, కేశవరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండల కేంద్రాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంలోని నిబంధనలు, చట్టాలను అందరూ పాటించాల్సిన అవసరం ఉందని వక్తలు సూచించారు.

– సాక్షినెట్‌వర్క్:



తాడిమర్రిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి



కదిరి తహసీల్దార్ కార్యాలయంలో..



ధర్మవరం కళాజ్యోతి సర్కిల్ వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నల్లమాడలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

# విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట

కనగానపల్లి: రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం నూతన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉమాదేవితో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.40 లక్షల నిధులతో నిర్మించిన ఈ భవనం ద్వారా ద్వారా గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అనుబంధంగా ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో కూడా అక్షర శాతాన్ని పెంపొందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమాదేవి, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, గ్రంథాలయాధికారులు గోవి పాల్గొన్నారు.

# ఆత్మీయ ట్రస్ట్ సేవలు అమూల్యం



విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈఓ గోపాల్‌నాయక్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ గోపాల్‌నాయక్, ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి, కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్ నిర్మలాదేవి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సానే రవీంద్రరెడ్డి, యూటీఎఫ్ జిల్లా నాయకుడు రామకృష్ణనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. ఆత్మీయ ట్రస్ట్ సేవలు వెలకట్టలేనివన్నారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహకారాలు అందించడం, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన రెడ్డి శ్రీ, నవ్యశ్రీ, గంగాభవాని, చిత్రలేఖనంలో వెన్నెల, లహరి, అశ్వితకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మెమెంటోలను అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న 191 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, రామంజినేయులు, ఆదిశేషు, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు హిదయ్‌తుల్లా, సాకే రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

పుట్టపర్తి టౌన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తోందని డిపో మేనేజర్ ఇనాయతుల్లా పేర్కొన్నారు. భక్తుల కోరిక మేరకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ఆదివారం పుట్టపర్తి బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల కోరిక మేరకు పండుగుల, జాతరలు, గిరిప్రదక్షణలకు, తిరునాలకు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు ప్రయాణికులకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 30 మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే అదనపు చార్జీలతో ఏ గ్రామం నుంచి అయినా బస్సులు నడుపుతామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పెద్దన్న పాల్గొన్నారు.